
కలెక్టరేట్ వద్ద రైతులకు మద్దతుగా నిర్వహించిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు


కలెక్టరేట్ వద్ద రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే శివకుమార్, ఎమ్మెల్సీలు హనుమంతరావు, ఏసురత్నం, అప్పిరెడ్డి, నగర అధ్యక్షుడు బాలవజ్రబాబు, సమన్వయకర్తలు మురళీకృష్ణ, వేమారెడ్డి, నూరిఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్

వాకర్స్‌కు ముచ్చెమటలు..

- ఎన్టీఆర్ స్టేడియంలో వీధి కుక్కల స్వైరవిహారం
- భయపడుతున్న వృద్ధులు, చిన్నారులు
- ఫిర్యాదు చేసినా చోద్యం చూస్తున్న అధికారులు


స్టేడియంలోని లాంగ్ జంప్ రింగ్‌లో నిద్రపోతున్న వీధి కుక్కలు

లక్ష్మీపురం: నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం రద్దీగా ఉంటుంది. క్రీడాకారులు ప్రాక్టీస్ చేస్తుంటారు. అదనంగా వాకింగ్, రన్నింగ్, వ్యాయామం కోసం చిన్నారుల నుంచి వృద్ధుల వరకు స్టేడియాన్ని వినియోగించుకుంటారు. అయితే వీరందరికీ శునక రాజాలు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. స్టేడియాన్ని స్థావరం చేసుకుని వాకింగ్ ట్రాక్‌పైనే పడుకుని భయపెడుతున్నాయి.

భయం భయంగా..

స్థానిక బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లో నగరపాలక సంస్థ ఆధీనంలో ఎన్టీఆర్ స్టేడియం ఉంది. ప్రతి రోజు వందల సంఖ్యలో నగర వాసులు వ్యాయామం చేసేందుకు వస్తుంటారు. పారిశ్రామిక వేత్తలు, డాక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు, రాజకీయ నాయకులు, విశ్రాంత అధికారులు, సీనియర్ సిటిజన్స్, వృద్ధులు చిన్నారులు ఇలా అనేక మంది కొంత సేపు ఆహ్లాదకరమైన వాతావరణంలో కాలక్షేపం చేస్తుంటారు. సాయంత్రం సమయంలో చిన్నారులకు అథ్లెటిక్స్, స్కేటింగ్, బాస్కెట్ బాల్ వంటి క్రీడల్లో శిక్షణ నడుస్తోంది.

వెంటాడుతున్న కుక్కలు...

స్టేడియం ప్రాంగణంలో గత కొన్ని రోజులుగా కుక్కలు పెరిగాయి. వాకింగ్, రన్నింగ్ చేసే సమయంలో వారిని వెంబడిస్తున్నాయి. విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన బెంచిల చుట్టూ పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. వ్యాయామ పరికరాల వద్ద కూడా కుక్కలు సంచరించడంతో భయం భయంతో ఉండాల్సి వస్తుందని వాకర్స్ వాపోతున్నారు.

లాంగ్ జంప్‌లో గ్రౌండ్‌లో..

స్టేడియానికి పలువురు యువత, అథ్లెటిక్స్ శిక్షణ పొందే వారు, ఆర్మీ, కానిస్టేబుల్ శిక్షణలకు వచ్చే వారు రన్నింగ్‌తో పాటు లాంగ్ జంప్ చేసేందుకు వస్తుంటారు. అయితే లాంగ్ జంప్ రింగ్‌లో కుక్కలు కూర్చుని ఉండటం వాటిని బయటకు పంపించేందుకు యత్నించిన వారిపై కుక్కలు దాడికి వస్తున్నాయి. దీంతో లాంగ్ జంప్ శిక్షణ కోసం వచ్చే వారు రావడం లేదు.

అసెంబ్లీలో ఫిర్యాదు చేసినా..

అసెంబ్లీ సాక్షిగా పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కుక్కల బెడదతో ఇక్కట్లు పడుతున్నారని స్వయంగా సమస్యను సభ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నగరపాలక సంస్థ అధికారులు రెండు రోజులు పాటు నామ మాత్రంగా ఫొటోల కోసం లక్ష్మీపురం, విద్యానగర్ వంటి ప్రాంతాలలో కుక్కలు పట్టుకునే వారు వాహనాలలో తిరుగుతూ ఫొటోలు తీసుకుని వెళ్లారు. కాని నగర వాసులకు కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించే యత్నం చేయలేదు.


రన్నింగ్ ట్రాక్‌లో వీధి కుక్కలు

నగరంలోనూ...

నగరంలోని ప్రధానంగా గుజ్జనగుండ్ల నుంచి మొదలు కొని, స్తంభాలగరువు, పట్టాభిపురం, కృష్ణానగర్, కొబాల్డ్‌పేట, దేవాపురం, రామాంజనేయకూటం, బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం, విద్యానగర్, సిద్ధార్థ నగర్, చంద్రమౌళినగర్, కొరిటిపాడు, ఏటీ అగ్రహారం వంటి ప్రాంతాల ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లో అధిక సంఖ్యలో కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. డాగ్ క్యాచర్స్‌ను పెట్టి ప్రతి రోజు ఫిర్యాదులు అందిన చోట వీధి కుక్కలను పట్టుకు వెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేస్తున్నాం. ఎన్.టి.ఆర్ స్టేడియంలో సంచరిస్తున్న వీధి కుక్కలను డాగ్ క్యాచర్స్ ద్వారా పట్టుకుని వాకర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ శోభారాణి, సీఎంఓహెచ్, నగరపాలక సంస్థ

కుక్కల సంఖ్య తగ్గించేందుకు..

నగర పాలక సంస్థ కుక్కల సంఖ్య తగ్గించేందుకు నియంత్రణ కేంద్రాన్ని నిర్వహిస్తోంది.గతంలో నామమాత్రంగా ఆపరేషన్లు చేసేవారు. అయితే ఇటీవల కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టి ఆపరేషన్ల సంఖ్య పెంచాలని ఆదేశించాలు ఇచ్చారు. అయినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు.

ఇదేమి న్యాయం


గోడను కూల్చివేసిన దృశ్యం

నెహ్రూనగర్: ఏటీ అగ్రహారం జీరో లైనులో రోడ్డు వెడల్పు పేరుతో పేద వర్గాలపై నగర పాలక సంస్థ అధికారులు ప్రతాపం చూపారు. కనీసం ముందస్తు నోటీసులు ఇవ్వాకుండానే మా ఇంటిని గోడను, గోడతో పాటు మరుగుదొడ్డిని కూల్చివేశారని బాధితులు నందిగం ఉమా మహేశ్వరరావు, జోష్నా రాణి వాపోయారు.

పండుగ సమయం కావడంతో రోజులు గడువు ఇవ్వాలని కోరినా..

ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు గత కొద్ది సంవత్సరాలుగా సాగుతున్నాయి. అయితే ఈ క్రమంలో జీరో లైనులో నివాసముండే ఉమా మహేశ్వరరావు ఇంటికి కూడా రోడ్డు వైడ్నింగ్ కోసం మార్కింగ్ ఇచ్చారు. ఈ మార్కింగ్‌లో భాగంగా శుక్రవారం సదరు ఇంటికి వచ్చిన నగరపాలక సంస్థ జేసీబీతో వచ్చారు. సదరు సమయంలో ఇంటిలో ఉమా మహేశ్వరరావు లేడు. మా ఆయన లేరని.. ఆయన వచ్చాక ప్రత్యామ్నాయంగా మరుగుదొడ్డి చూసుకున్నక మరుగుదొడ్డి, గోడను పగలగొట్టవద్దని జోత్స్న బలిమాలడింది. పండుగ సమయం అని కొన్ని రోజుల సమయం ఇవ్వండి ఆ తరువాత కూల్చివేతకు సహకరిస్తామని కోరినప్పటికి కనీసం కనికరం లేకుండా జేసీబీతో కూల్చివేశారని వాపోయింది జోత్స్న.

క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ పొదుపు వారోత్సవాలు

కొరిటిపాడు(గుంటూరు): ఏపీ సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ పరిధిలో శనివారం నుంచి 21వ తేదీ వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గుంటూరు సర్కిల్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులలో విద్యుత్ పొదుపుపై అవగాహన పెంపొందించేందుకు వక్తృత్వ పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన పెంపొందించుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు అమలులోనికి తెచ్చాయన్నారు. 19వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు.

రూ.13.88 లక్షల అపరాధ రుసుం వసూలు

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో డీ–13 సెక్షన్ పరిధిలోని ఆటోనగర్, నవభారత్ నగర్, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస బాబు మాట్లాడుతూ తనిఖీల్లో 59 మంది అధికారులు, 177 మంది సిబ్బంది 59 బృందాలుగా ఏర్పడి 5,231 సర్వీసులను తనిఖీ చేసినట్లు వివరించారు. అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుకుంటున్న ఒకరికి రూ.16 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 301 మందికి రూ.13.72 లక్షలు కలిపి మొత్తంగా రూ.13.88 లక్షలు అపరాధ రుసుం విధించడం జరిగిందని చెప్పారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరం అని, విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులకు పూర్తి వివరాలతో 9440812263, 9440812360 నేరుగా లేదా వాట్సప్ యాప్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. తనిఖీల్లో డీఈఈలు కె.రవికుమార్, పీహెచ్ ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఆపరేషన్ ఏఈ వి.బాజీ పాల్గొన్నారు.

వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీపై కార్యశాల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వృక్ష, సూక్ష్మజీవ శాస్త్రాల విభాగం, ఫారెస్ట్రీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీపై కార్యశాలను నిర్వహించారు. వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ డాక్టర్ వెంకటరమణ నరేంద్ర, యూనివర్సిటీ ఫొటోగ్రాఫర్ గుత్తా సునీల్ కుమార్ వివిధ అంశాలపై విద్యార్థులకు మెలకువలు వివరించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ సఫారీలను సందర్శించి జీవవైవిధ్యాన్ని ఆయన తన కెమెరాలో బంధించానని తెలిపారు. విద్యార్థులు ల్యాండ్ స్కేప్ స్కిల్, డ్రోన్స్, ట్రై ఆర్డర్, ఫొటోగ్రఫీ విధానాలలో మెలకువలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వృక్ష, సూక్ష్మజీవ శాస్త్రాల విభాగాధిపతి కే మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దివ్య తేజో మూర్తి పాల్గొన్నారు.

‘అప్పాజోస్యుల’కు ఘన సన్మానం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు తుమ్మల కళాపీఠం పురస్కారం, రూ.20 వేల నగదు అందించారు. సభకు డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఆచార్య అప్పాజోస్యుల గొప్ప శాస్త్రవేత్త అని అన్నారు. రాష్ట్రంలో మూడు దశాబ్దాలుగా ఉంటూ, సాంస్కృతిక రంగానికి అనేక సేవలు అందించారని కొనియాడారు. పురస్కారగ్రహీత అప్పాజోస్యుల సత్యనారాయణ ప్రసంగిస్తూ తుమ్మల సీతారామమూర్తి మహాకవి అని ప్రశంసించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలన చేయగా, డాక్టర్ సూర్యదేవర రవికుమార్, నూతలపాటి తిరుపతయ్య, డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ నాగసుశీల, డాక్టర్ వి.సింగారావు, డాక్టర్ బీరం సుందరరావు, పి.మృత్యుంజయరావు, మల్లికార్జున రాయశాస్త్రి, దేశం పాపిరెడ్డి, ఏలూరి సూర్యనారాయణ, పారా అశోక్‌కుమార్, ఎం.రవికృష్ణ, నాగేంద్రం పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

నగరంపాలెం: గుజ్జనగుండ్లలోని శ్రీఆంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం హనుమత్ వ్రతాలు నిర్వహించారు. సీతమ్మ అమ్మ వారి జాడను తెలుసుకుని, లంకలో కలిసిన పర్వదినాన్ని పురస్కరించుకుని వార్షిక వ్రతాలు చేపట్టారు. ఈ వ్రతాలు భక్తుల సహకారంతో శ్రీమాన్ యోగానంద చార్యులు, శ్రీనివాసుల రఘురాం నిర్వహించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు


అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ నల్లపాడు, విద్యానగర్, రెడ్డి పాలెం, ఎల్ఆర్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల స్థానిక సమస్యల పరిష్కారం కోసం చేపట్టే అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది రికార్డు చేయాలన్నారు. ఎమినిటి కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పనులను ప్రతి రోజు పరిశీలించాలని, నాణ్యతలో లోపం గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావలని ఆదేశించారు. నల్లపాడు రైల్వే స్టేషన్ రోడ్ కల్వర్ట్ పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ మధుసూదన్ పాల్గొన్నారు.

వ్యాధులను గుర్తించే కొత్త ఆవిష్కరణలు చేపట్టాలి

ఏఎన్‌యూ: ఆక్వారంగంలో వచ్చే వ్యాధులను గుర్తించే విధంగా కొత్త ఆవిష్కరణలు చేయాలని రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాలలోని ఈ అండ్ ఐటీ (ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ) విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంబెడెడ్ సిస్టమ్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ వాటి పాత్ర అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు గౌరవ అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీని వ్యవసాయ, ఆక్వా రంగంలో కూడా విస్తరింప చేయాలని, మనిషి అవసరం లేకుండా వ్యవసాయ స్థితిగతుల గురించి తెలుసుకునే విధంగా ఆవిష్కరణలు రావాలని సూచించారు. అమరావతిలోని విట్ ప్రొఫెసర్ అమిత్ చవాన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరయ్య, ఇన్‌చార్జి ఓఎస్డీ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, ఫీజిటెక్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రమణ తేజ వెనిగళ్ల, విశిష్ట ఇన్నోవేటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సాధు సాయి సందీప్ మాట్లాడారు. సదస్సుకు విభాగాధిపతి ఆచార్య సంధ్యకోల్ అధ్యక్షత వహించారు. అధ్యాపకులు డాక్టర్ షర్మిల, కళ్యాణి, రవిచంద్ర పాల్గొన్నారు.

సౌత్ జోన్ బాక్సింగ్ పోటీలకు ఆదిత్య


విద్యార్థిని ఆదిత్యతో కేవీ బ్రహ్మం, అనితాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: పంజాబ్‌లోని గురుకాశీ విశ్వవిద్యాలయంలో ఈనెల 16 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్ విశ్వ విద్యాలయాల సౌత్ జోన్ మహిళా బాక్సింగ్ పోటీలకు టీజేపీఎస్ కళాశాల డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థిని ఎస్. ఆదిత్య ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ, బాక్సింగ్ శిక్షకుడు హనుమంతయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఎ.భాను మురళీధర్, మేజర్ పి.కుమార్ రాజా, డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు(గుంటూరు): సుద్దపల్లి డొంక విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టీ–4 డీఈఈ పీహెచ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కోత ఉంటుందని చెప్పారు. ప్రగతి నగర్, యానాది కాలనీ, లక్ష్మీనగర్ ఏరియా వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆటో నగర్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ నిర్వహణ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆటోనగర్ ఫేజ్ 3, ఫేజ్ 4 ఫీడర్స్ పరిధిలోని విశ్వనాథ్ హోటల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రోడ్, హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఏరియాలు, కాకుమానువారితోట ఉపకేంద్రం పరిధిలో బొంగరాలబీడు ఫీడర్ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని డీ–9 ఏఈ ఎం.రవికుమార్ తెలిపారు.

డీ–13 సెక్షన్ పరిధిలో 33కేవీ, 11 కేవీ ఫీడర్స్, సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్ కారణంగా ఆర్టీసీ కాలనీ, నందివెలుగు రోడ్, విజయవాడ రోడ్, సీతారామనగర్, మంగళదాస్ నగర్, ఇశ్రాయిల్ పేట, షాప్ ఎంప్లాయిస్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని డెప్యూటీ ఇంజినీర్ పీహెచ్ ఖాన్ తెలిపారు.

డీ–12 సెక్షన్ పరిధిలో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా గుంటూరు రూరల్ మండలంలోని పొత్తూరు, నాయుడుపేట, ఓబుల్‌నాయుడుపాలెం, అంకిరెడ్డిపాలెం, సుబ్బారెడ్డి కాలనీ, ఆదర్శనగర్, రామాలయం వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతోందని టీ–3 విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం డీ–3 సెక్షన్ పరిధిలోని రామిరెడ్డితోట, ప్రకాష్ నగర్, గణేశ్వరరావు పేట, ఓల్డ్ క్లబ్ రోడ్, గుంటూరివారితోట, డీ–1 సెక్షన్ పరిధిలోని అరండల్‌పేట 1వ లైన్ నుంచి 4వ లైన్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. అలాగే డీ–10 సెక్షన్ పరిధిలోని పొన్నూరు రోడ్, సంగడిగుంట, ఐపీడీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని గుంటూరు టౌన్–1 డిప్యూటీ ఇంజనీరు షేక్ ముస్తాక్ అహమ్మద్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

కేఎల్‌పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో భాగంగా జరిగిన వివిధ పోటీల్లో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. రత్తయ్య మాట్లాడుతూ పుస్తక మహోత్సవంలో భాగంగా కథ చెబుతాను ఊ కొడతారా పోటీలో ఎస్‌కే అఫీసా, ఆర్. వినూత్న దర్శిని, వెరోనిక జీవన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. నేనే చదివిన మంచి పుస్తకం పోటీలో ఏ మోక్షశ్రీ, కె.హిమ వెంకట నాగశ్రీ, జె.లక్ష్మీ హారిక తొలి మూడుస్థానాల్లో నిలిచారని వివరించారు. శతక పద్య పఠన పోటీలో ఆర్.వినూత్న దర్శిని, ఎస్‌కే జరీనా, టి.చరణ్ శ్రీ తొలి మూడుస్థానాల్లో నిలువగా, బి.లికేష్ ప్రత్యేక బహుమతి పొందారని పేర్కొన్నారు. క్విజ్‌లో అఫీసా, రోహిత, అయాన్ ముజామిల్ ప్రథమ బహుమతి, టి.ఉత్తేజ్‌రెడ్డి, డి. రేష్మ, బి.శ్రీనిత్య తృతీయ బహుమతితో పాటు ఆర్.వినూత్న దర్శిని, కె.హరిణి, సీహెచ్ రోశయ్య ప్రత్యేక బహుమతులు గెలుపొందినట్లు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో బోధన ఆంగ్ల మాధ్యమంలో ఉన్నప్పటికీ, మాతృభాష అయిన తెలుగుపై పట్టు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

సీపీఐ నాయకుల మద్దతు కోరిన కేఎస్ లక్ష్మణరావు



గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి కృష్ణా– గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పీడీఎఫ్ తరఫున పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు, సీపీఐ నాయకుల మద్దతు అభ్యర్థించారు. ఈమేరకు శుక్రవారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర నాయకురాలు అక్కినేని వనజను కలసి తనకు మద్దతు తెలపాల్సిందిగా కోరినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కౌలురైతులు, అంగన్‌వాడీలు, మహిళలతో పాటు వివిధ సామాజిక వర్గాల సమస్యల పరిష్కారానికి మండలి వెలుపల, బయట కృషి చేస్తున్నానని తెలిపారు.

వృత్తికి అంకితమై.. నిబద్ధతతో విధుల నిర్వహణ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాబోధనకు అంకితమై, విధి నిర్వహణలో నిబద్ధతతో సేవలు అందిస్తున్న ఉపాధ్యాయురాలిని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అభినందించారు. గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియం వద్ద ఉన్న శ్రీమహాకవి తిక్కన పులిపాక కమలా హనుమంతరాయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం డీఈఓ రేణుక సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ–1 పరీక్షల తీరును పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న విభిన్న ప్రతిభావంతురాలైన బి.ఉమా మహేశ్వరి గురించి ప్రధానోపాధ్యాయుడు బీవీ రమణయ్య ద్వారా తెలుసుకున్నారు. సదరు ఉపాధ్యాయిని ఏడాది పొడవునా కేవలం రెండు రోజులే సెలవు వినియోగించుకున్నారు. మిగిలిన రోజులు విద్యాబోధనలో ఎంతో శ్రద్ధాశక్తులతో నిమగ్నమయ్యారు. సాధారణంగా ఏడాదిలో, ప్రత్యేకించి మహిళా ఉపాధ్యాయులకు 27 సెలవులను వినియోగించుకునే వెసులుబాటు ఉంది. అయితే పాఠశాలలో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దే క్రమంలో వృత్తిపై అంకితభావంతో పని చేస్తున్న ఉమా మహేశ్వరి అనవసరంగా సెలవు పెట్టడం ఇష్టం లేక పనిదినాల్లో పూర్తిస్థాయిలో పాఠశాలకు హాజరయ్యారు.

ఫ్లారెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో సేవలందించండి

జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ


డాక్టర్ యశస్వి రమణను సన్మానిస్తున్న నర్సింగ్ అధికారులు, నర్సింగ్ సంఘం నేతలు

గుంటూరు మెడికల్: నర్సుల ఆరాధ్య దైవం ఫ్లారెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో నర్సులు రోగులకు సేవలందించి వారు త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకోవడంలో తమ వంతు పాత్ర పోషించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ జీజీహెచ్‌లో క్లీనికల్ నాలెడ్జ్ పెంచుకునేందుకు చాలా అవకాశం ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ నాలెడ్జ్ సంపాదించుకుని నర్సింగ్ వృత్తిలో రాణించాలని సూచించారు. నర్సింగ్ సిబ్బందికి సమయపాలన చాలా ముఖ్యమని, డాక్టర్లు రోగులను పరీక్షించేందుకు వచ్చే సమయానికల్లా బెడ్‌మేకింగ్ సిద్ధం చేసి బీపీ, షుగర్ పరీక్షించి కే షీట్ సిద్ధం చేయాలన్నారు. నర్సింగ్ వృత్తికి చాలా పోటీ ఉందని, వృత్తిలో రాణించాలంటే ప్రతి ఒక్కరూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ప్రజలు కూడా వైద్యంపై అవగాహన కలిగి ఉంటున్నారని, దానికనుగుణంగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. నర్సింగ్ విద్యార్థులు పలు గీతాలు ఆలపించి సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. డాక్టర్ యశస్వి రమణను నర్సింగ్ అధికారులు, నర్సింగ్ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సుజాత, గ్రేడ్–1నర్సింగ్ సూపరింటెండెంట్ గంగ, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయ, ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా సెక్రటరీ వెల్లంపల్లి పద్మజ, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మలబార్‌లో మైన్ డైమండ్ షో ప్రారంభం


మైన్ డైమండ్ షోను ప్రారంభిస్తున్న ప్రముఖులు

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో ‘మైన్’ డైమండ్ షోను డాక్టర్ శిల్ప సింధూరం కడియాల, పెద్ది రమణా రావు శుక్రవారం ప్రారంభించారు. రోజూ ధరించే నగలు, వివాహ, ప్లాటినం, పురుషుల ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, ప్లాటినం ఆభరణాల సముదాయంతో అందుబాటులో ఉంటాయని షోరూం హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ సిహెచ్.గోపీకిరణ్ తెలిపారు. ఈనెల 13వతేది నుంచి 17 వరకు డైమండ్ షో కొనసాగుతుందని చెప్పారు. వజ్రాభరణా ల కొనుగోలుపై వజ్రాల విలువలో 25 శాతం వరకు తగ్గింపు పొందవచ్చునని పేర్కొన్నారు. పాత వజ్రాభరణాల మార్పిడిపై 100 శాతం విలువను పొందవచ్చునని అన్నారు. ఈ ఆఫర్లు వచ్చేనెల 12 వరకు అని, షరతులు వర్తిస్తాయని తెలిపారు. వినియోగదారులు కొనుగోలు చేసే బంగారం విలువ లో పది శాతం ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చునని అన్నారు.

20వ తేదీన కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొనఆనరు. ఇప్పటికే సభ్యుల నుంచి ప్రశ్నలను స్వీకరించారు. ఆ ప్రశ్నలకు అధికారులు సమాధానాలు సిద్ధం చేస్తున్నారు.

వర్గీకరణను సాధించుకోవాలి

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ చేయాలని తీర్పు ఇచ్చిందని... కాని దీనిని మాలలు వ్యతిరేకించడం సమంజసం కాదని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షులు మక్కెన ప్రభాకర్ మాదిగ తెలిపారు. వర్గీకరణను మాలలు వ్యతిరేకించడాన్ని ఖండిస్తూ శుక్రవారం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్బయ్య మాదిగ, సురేష్ మాదిగ, విజయ్ మాదిగ, చంద్రయ్య మాదిగ పాల్గొన్నారు.